సాక్షి శ్రీకాకుళం

శుక్రవారం ॥ 9 ॥ ఫిబ్రవరి ॥ 2024



గురుకులానికి ఆహ్వానం

జీఆర్ అంబేడ్కర్ గురుకుల విద్యాలయాల్లో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. 23 వరకు గడువుంది.

- 8లో



వందశాతానికి చేరువలో..

జిల్లాలో కుల గణన వందశాతానికి చేరువలో ఉంది. ఆ మేరకు పనులు జరుగుతున్నాయి.

- 8లో

కార్చిచ్చులపై అవగాహన

నరుబుజ్జిలి: అడవుల్లో వేసవిలో కార్చిచ్చులు ఏర్పడకుండా గిరిజనులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని అటవీ శాఖ పాలకొండ రేంజ్ బీట్ అధికారులు జాకీర్ ఆలీబేగ్, హరిబాబు తెలిపారు. అడవుల్లో కార్చిచ్చు ఏర్పడకుండా కడగండి రిజర్వ్ ఫారెస్ట్ పరిసర గ్రామం వెన్నెలవలసలో గిరి పుత్రులకు గురువారం అవగాహన కల్పించారు. అడవుల్లో కాల్చిన సిగరెట్, చుట్ట, బీడీలను పడవేయరాదని చెప్పారు.

న్యూస్‌రీల్

నేడు శ్రీకాకుళంలో జాబ్‌మేళా

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లా కేంద్రంలో డీఎల్‌టీసీ/ఐటీఐ శిక్షణ కేంద్రం వేదికగా ఈనెల 9న మెగా జాబ్‌మేళా జరగనుందని జిల్లా ఉపాధి అధికారి కొత్తలంక సుధ తెలిపారు. శుక్రవారం ఉదయం 10.30 గంటల నుంచి ఈ మేళా జరగనుందని చెప్పారు. పేటీఎం కంపెనీలో వివిధ హోదాల్లో 35 పోస్టులు, అపోలో ఫార్మసీ లిమిటెడ్ కంపెనీలో 100 పోస్టులు, నవతా రోడ్ ట్రాన్స్‌పోర్ట్ కంపెనీలో 90 పోస్టులు, యూనివర్సల్ గ్రూపు కంపెనీలో వివిధ హోదాల్లో 55 పోస్టులను భర్తీ చేసేందుకు ఈ జాబ్‌మేళాను నిర్వహిస్తున్నట్టు చెప్పారు. 18 నుంచి 45 ఏళ్ల మధ్య వయస్సు కలిగి టెన్త్/ఇంటర్/ఐటీఐ/డిప్లమో /ఫార్మసీ/డిగ్రీ/పీజీ తదితర కోర్సులు కలిగిన గల యువతీ యువకులు హాజరు కావాలని సూచించారు. తమ బయోడేటా, సర్టిఫికెట్లు, ఆధార్‌కార్డుతో హాజరుకావాలని సుధ కోరారు. అందివచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.


భార్యాభర్తలకు కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాలు



మహేష్ తల్లిదండ్రులతో దంపతులు

సోంపేట: మండలంలోని ఇస్కలపాలేం గ్రామానికి చెందిన భార్యాభర్తలు సూరాడ మహేష్, పుణ్యవతి దంపతులు ఒకేసారి కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాలు సాధించి సత్తా చాటారు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు.. ఎంకాం చదివిన మహేష్ అండమాన్‌లో ఓ ప్రైవేటు కంపెనీలో పనిచేస్తున్నారు. బీకాం చదివిన పుణ్యవతితో రెండేళ్ల కిందట వివాహమైంది. పెళ్లయ్యాక కెరీర్‌లో ఉన్నతంగా స్థిరపడాలనే ఆలోచనతో కుటుంబ సభ్యుల ప్రోత్సాహంతో దంపతులిద్దరూ ప్రభుత్వ ఉద్యోగ పరీక్షలకు సిద్ధమయ్యారు. ఇద్దరూ సఫలీకృతులై మహేష్ డైరెక్టర్ ఆఫ్ షిప్పింగ్ సర్వీస్‌లో, పుణ్యవతి డైరెక్టర్ ఆఫ్ హెల్త్ సర్వీస్‌లో ఉద్యోగం సాధించారు. కుటుంబ సభ్యుల ప్రోత్సాహం వల్లనే ఇది సాధ్యమైందని వారు పేర్కొన్నారు. భార్యభర్తలకు టీచర్ శ్యామ్, ఎరుపల్లి గణేష్, గ్రామస్తులు అభినందనలు తెలిపారు.

ఎలుగుల సంచారంపై అప్రమత్తం



చిన్నారులు, ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న ఫారెస్ట్ అధికారులు

వజ్రపుకొత్తూరు రూరల్: ఉద్దానం, తీర ప్రాంతాల్లో సంచరిస్తున్న ఎలుగులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కాశీబుగ్గ డివిజన్ ఫారెస్ట్ రేంజర్ మురళీకృష్ణం నాయుడు అన్నారు. మండలంలో గల కొండపల్లి గ్రామం ప్రాథమిక పాఠశాల ఆవరణంతో పాటు గ్రామ పరిసరాల్లో బుధవారం ఎలుగు సంచరించి హడలెత్తించింది. ఈ మేరకు అటవీశాఖాధికారులు ఎలుగు సంచార ప్రాంతంలో గురువారం పర్యటించి చిన్నారులు, ఉపాధ్యాయులు, ప్రజలతో మాట్లాడారు. పాఠశాలకు ప్రహరీ లేకపోవడంతో ఎలుగు పాఠశాల ఆవరణలోకి ప్రవేశించిందని, ఆ సమయంలో ఆరుబయట చిన్నారులు లేకపోవడంతో పెను ప్రమాదం తప్పిందని వారు అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తామని ఫారెస్ట్ అధికారులు హామీ ఇచ్చారు. ఎలుగుల సంచారంపై అప్రమత్తంగా ఉండటం ఎంతో అవసరమని అటవీ శాఖాధికారులు అన్నారు. ఎలుగులు కనిపిస్తే తమకు వెంటనే సమాచారం అందించాలని అన్నారు. అలాగే అక్కుపల్లి, బాతుపురం తదితర గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. జీడి తోటలకు వెళ్లేటప్పుడు ఒంటరిగా వెళ్లరాదని సూచించారు. ఈ పర్యటనలో ఫారెస్ట్ అధికారులు రెడ్డి, రాజు, పోలయ్య, సంతోష్, సిబ్బంది ఉన్నారు.

పరీక్ష ఫలితాలు విడుదల

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విశ్వవిద్యాలయం పరిధిలోని బీపీఈడీ, డీపీఈడీ ఫలితాలను వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ కేఆర్ రజిని గురువారం విడుదల చేశారు. ఫలితాలు జ్ఞాన భూమి పోర్టల్‌లో అందుబాటులో ఉంచినట్లు చెప్పారు. ఆన్‌లైన్ కోర్సు ఎర్లీ చైల్డ్ కేర్ ఎడ్యుకేషన్ సర్టిఫికెట్ కోర్సు ఫలితాలు విడుదల చేశారు. విద్యార్థులకు త్వరితగతిన ధ్రువీకరణ పత్రాలు అందజేసేలా చర్యలు తీసుకోవాలని వీసీ సూచించారు.


వెలుగు మల్లెలు విరబూసె..



- గిరిజన గృహాల్లో కొత్తగా విద్యుత్ కనెక్షన్లు
- జిల్లా సర్కిల్‌లో రూ.60 లక్షలతో మొత్తం 1308 ఇళ్లకు విద్యుద్దీకరణ
- కొండలెక్కి స్వయంగా విద్యుత్ సరఫరాను పరిశీలించిన ఎస్ఈ కృష్ణమూర్తి



పాతపట్నం మండలం కొండభీంపురంలో గిరిజన ఆవాసాల మధ్యలో విద్యుత్ వెలుగులు



గిరిజన ప్రాంతాల్లో వీధి లైట్ల వెలుగులు ఇలా..

అరసవల్లి: కొండల్లో వెలుగు పూలు విరబూస్తున్నాయి. ఇన్నాళ్లూ చీకటితో అలమటించిన ఆదివాసీలకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వెలుగు దారి చూపించింది. దశాబ్దాల కాలం నుంచి విద్యుత్ కాంతులకు దూరంగా ఉన్న కొండ ప్రాంతాలు, గిరిజన ఆవాసాలకు ఇన్నాళ్లకు మోక్షం కలిగింది. రాష్ట్రంలో అడవులు, కొండల్లోని మారుమూల ప్రాంతాల్లో ఉన్న ప్రతి గిరిజన గృహాలకు విద్యుత్ సౌకర్యం కల్పించాలన్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నిర్ణయాన్ని అధికారులు అమల్లోకి తీసుకువచ్చారు. దీనికితోడు కేంద్ర ప్రభుత్వం కూడా ప్రధానమంత్రి జనకాంతి ఆదివాసీ న్యాయ మహాభియాన్ పథకానికి మన రాష్ట్రాన్ని ఎంపిక చేయడంతో మరిన్ని గిరిజన ప్రాంతాల్లో విద్యుత్ వెలుగులు కనిపించనున్నాయి. ఈ మేరకు తూర్పుప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ ఆధ్వర్యంలో ఉత్తరాంధ్ర జిల్లాల్లోనే మొత్తం 8,189 గిరిజన కుటుంబాలకు విద్యుద్దీకరణకు రూ.33.49 కోట్లతో ప్రతిపాదించింది. అందులో భాగంగా ఉమ్మడి శ్రీకాకుళం జిల్లాలో 16 మండలాల్లో మొత్తం 346 హేబిటేషన్లలో విద్యుత్ సౌకర్యం లేదని ప్రత్యేక సర్వే బృందం గుర్తించింది. ఇందుకోసం రూ.60 లక్షలతో ప్రత్యేకంగా విద్యుత్ లైన్లను వేస్తూ ఇంటింటికీ విద్యుత్ సరఫరాకు చర్యలు చేపడుతోంది.

1308 గిరిజన గృహాల్లో విద్యుద్దీకరణ

ఇంధన శాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఉమ్మడి జిల్లాలో విద్యుత్ సర్కిల్ ఎస్ఈ నాగిరెడ్డి కృష్ణమూర్తి ఆధ్వర్యంలో విద్యుత్ సరఫరా లేని గిరిజన ప్రాంతాల్లో సర్వే నిర్వహించారు. ఈ మేరకు ఉమ్మడి జిల్లా పరిధిలోని సీతంపేట, వీరఘట్టం, భామిని, పాతపట్నం, టెక్కలి, సరుబుజ్జిలి, మెళియాపుట్టి, సోంపేట, కంచిలి, పలాస, నందిగాం, బూర్జ, హిరమండలం, కొత్తూరు, మందస, సారవకోట తదితర 16 మండలాల్లో 346 హేబిటేషన్ గ్రామాల్లో 1308 గిరిజన గృహాల్లో విద్యుత్ కనెక్షన్లు ఇచ్చేందుకు విద్యుత్ శాఖ నిర్ణయించింది. ఇందుకోసం రూ.60 లక్షల నిధులను వెచ్చిస్తుండగా.. ఈ పనుల్లో భాగంగా ఇప్పటికే విద్యుత్ స్తంభాలను కొండలెక్కిస్తున్నారు. స్తంభాలు వేయలేని చోట్ల సోలార్ విద్యుత్‌ను అందించేలా ప్రభుత్వం ఆదేశించినప్పటికీ జిల్లాలో చాలావరకు విద్యుత్ సామగ్రి కొండలెక్కిపోయాయి. గిరిజన వాడల్లో విద్యుత్ స్తంభాలు, ఎల్ఈడీ లైట్లతో పాటు సామర్థ్యం గల ట్రాన్స్‌ఫార్మర్లను కూడా అమర్చుతున్నారు. విద్యుత్ సర్కిల్ ఎస్ఈ నాగిరెడ్డి కృష్ణమూర్తి పలుచోట్ల కొండలు ఎక్కి గిరిజనులతో మాట్లాడి విద్యుద్దీకరణ పనులను స్వయంగా పరిశీలించారు.



15,138 మంది గిరిజనులకు ఉచిత విద్యుత్

అర్హులైన గిరిజన లబ్ధిదారులకు ప్రభుత్వం సబ్సిడీతో నెలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందిస్తోంది. జిల్లాలో 15,138 మంది గిరిజన గృహాలకు ఈ రాయితీలను వర్తింపజేస్తున్నారు. ఈ రాయితీల్లో భాగంగా ఇంధన వినియోగ చార్జీలు, ట్రూ-అప్, ఎఫ్ఎపిసిఎ చార్జీలను కూడా రాష్ట్ర ప్రభుత్వం భరిస్తోంది. ఈ లెక్కన గత ఏడాది ఏప్రిల్ నుంచి జనవరి 2024 నాటికి రూ.16.01 లక్షల మేరకు రాయితీను రాష్ట్ర ప్రభుత్వమే డిస్కంకు చెల్లించనుంది. గత ప్రభుత్వం చెల్లించాల్సిన ఎస్టీ వినియోగదారుల రాయితీ బకాయిలను సుమారు రూ. కోటి వరకు బకాయిలను కూడా ప్రస్తుత ప్రభుత్వమే విద్యుత్ సంస్థలకు చెల్లించింది. గత ప్రభుత్వం హయాంలో 0–75 యూనిట్ల పరిమితి ఉండేది. 100 యూనిట్ల పరిధి దాటిన వినియోగదారుల సర్వీసులకు విద్యుత్ సరఫరా నిలిపివేసే పరిస్థితులు నాడు ఉండేవి. అయితే ఇప్పుడు ఆ బకాయిలను సైతం ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వమే చెల్లించడంతో పాటు యూనిట్ల పరిమితిని కూడా 200 వరకు పెంచేసింది. దీంతో అర్హులైన ఎస్టీ కుటుంబాలకు క్రమం తప్పకుండా సబ్సిడీని వర్తింపజేస్తూనే మరింత మంది అర్హులకు ఎంపిక చేస్తూ ఈ పథకాన్ని అమలు చేస్తోంది.

గిరిజనుల కళ్లల్లో ఆనందం చూశాను



ఉమ్మడి జిల్లాలో మొత్తం 1308 గిరిజన గృహాలకు విద్యుత్ కనెక్షన్లను అందించే లక్ష్యంగా పని చేస్తున్నాం. ఇప్పటివరకు 635 ఇళ్లకు కనెక్షన్లను ఇచ్చేయగా, ఇంకా 673 గృహాలకు కనెక్షన్లు ఇవ్వాల్సి ఉంది. ఈ నెలాఖరులోగా వీటిని కంప్లీట్ చేస్తాం. నిజంగా కొండల్లో గిరిజనుల ఇళ్లకు విద్యుత్ రావడంతో వారి కళ్లల్లో ఆనందం చూశాను. ప్రభుత్వ నిర్ణయంతో ఇన్నాళ్లకు కొండల్లోకి విద్యుత్ వెలుగులు వచ్చాయి. జిల్లాలో విద్యుత్‌ను నాణ్యతగా అందించే ప్రతి ప్రయత్నాన్ని పూర్తి చేస్తాం.

– నాగిరెడ్డి కృష్ణమూర్తి, ఎస్ఈ, విద్యుత్ సర్కిల్

విద్యార్థుల సృజనకు సాంకేతిక సాయం



విద్యార్థులు తీసుకువచ్చిన ప్రాజెక్టులను పరిశీలించి వివరాలు తెలుసుకుంటున్న విద్యా శాఖాధికారి కె.వెంకటేశ్వరరావు, యునిసెఫ్ ప్రతినిధి టి.సుదర్శనరావు తదితరులు

టెక్కలి: విద్యార్థుల్లో అంతర్లీనంగా దాగి ఉన్న సృజనాత్మకత ఆలోచనకు సాంకేతిక పరిజ్ఞానం జోడించి సమాజానికి ఉపయోగపడే అద్భుతమైన ప్రాజెక్టులను రూపకల్పన చేయవచ్చని జిల్లా విద్యాశాఖాధికారి కె.వెంకటేశ్వరరావు, యునిసెఫ్ ప్రతినిధి టి.సుదర్శనరావు సూచించారు. టెక్కలి ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాలలో అటల్ ఇన్నోవేషన్ చాలెంజెస్ అనే అంశంపై శిక్షణ తరగతులను గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా వ్యాప్తంగా 23 పాఠశాలల నుంచి అటల్ టింకరింగ్ ల్యాబ్‌ల ద్వారా 50 సైన్సు ప్రాజెక్టులతో ఉపాధ్యాయులు, విద్యార్థులు హాజరయ్యారు. విద్యార్థులు తయారు చేసిన ప్రాజెక్టులకు అవసరమైన సాంకేతిక పరిజ్ఞానంపై ఆదిత్య కళాశాలలో రెండు రోజుల పాటు శిక్షణ అందజేయనున్నారు. యునిసెఫ్, సమగ్ర శిక్ష, ఎస్ఈఆర్‌టీ, ఆదిత్య కళాశాల, విజ్ఞాన్ ఆశ్రమ్ సహకారంతో మొట్టమొదటి సారిగా ఇలాంటి శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. విద్యార్థులు రూపొందించిన ప్రాజెక్టులకు సాంకేతిక పరిజ్ఞానం అందజేయడానికి ఆదిత్య కళాశాల ముందుకు రావడం అభినందనీయమని ముఖ్య అతిథులు జిల్లా విద్యా శాఖాధికారి కె.వెంకటేశ్వరరావు, యునిసెఫ్ ప్రతినిధి టి.సుదర్శనరావు కొనియాడారు. ఇలాంటి శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోవాలని వారు ఆకాంక్షించారు. ఇందులో ఉత్తమ ప్రాజెక్టులకు ఈ నెల 28న జాతీయ సైన్స్ దినోత్సవం రోజున బహుమతులు అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా సైన్సు అధికారి కుమారస్వామి, ఉప విద్యా శాఖాధికారి ఆర్.విజయకుమారి, సమగ్ర శిక్ష సెక్టోరియల్ అధికారులు లక్ష్మణరావు, నలినికాంత్, ఆదిత్య కళాశాల డైరెక్టర్ వీవీ నాగేశ్వరరావు, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డి.విజయకుమార్, అధ్యాపకులు సతీష్, దినకర్, రఘువీర్, సురేష్, వంశీనారాయణ తదితరులు పాల్గొన్నారు.



హాజరైన విద్యార్థులు, ఉపాధ్యాయులు.

డీవార్మింగ్ మాత్రలు తప్పనిసరి




డీవార్మింగ్ డే కరపత్రాలను ప్రదర్శిస్తున్న డీఎంహెచ్ఓ మీనాక్షి తదితరులు

అరసవల్లి: డీ వార్మింగ్ డే సందర్భంగా శుక్రవారం నాడు జిల్లాలో అన్ని అంగన్‌వాడీ, ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు, జూనియర్ కళాశాలల విద్యార్థులకు నులిపురుగుల నిర్మూలన కోసం ఆల్బెండజోల్ 400 ఎంజీ మాత్రలు తప్పనిసరిగా మింగించాలని జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి డాక్టర్ బి.మీనాక్షి సూచించారు. ఆమె గురువారం స్థానిక డీఎంహెచ్ఓ కార్యాలయంలో డీవార్మింగ్‌డే కరపత్రాలను ఆమె ప్రదర్శించారు. జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమంలో భాగంగా జిల్లాలో అన్ని విద్యాసంస్థల్లోనూ పిల్లల కోసం 4,54,835 ఆల్బెండజోల్ మాత్రలను సిద్ధం చేశామన్నారు. ఈ మాత్రలను ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల్లోగా మింగించాలని, 1–2 వయస్సున్న పిల్లలకు సగం మాత్ర, 3–19 వయస్సు గల పిల్లలకు ఫుల్ మాత్రను నమిలించి తినిపించాలన్నారు. సైడ్ ఎఫెక్ట్స్ రాకుండా ఆశ వర్కర్లు, అంగన్‌వాడీలు, వైద్య సిబ్బంది తప్పనిసరిగా పాఠశాలల వద్ద ఉండి.. ఈ కార్యక్రమాన్ని నిర్వహించాలన్నారు. ఇంకా ఎవరైనా మిగిలిన వారుంటే 16న మాప్‌అప్ డే ద్వారా అందరికీ మాత్రలు వేయించేలా చర్యలు చేపడతామని ప్రకటించారు.

రాజ్యసభలోనూ ఉత్తరాంధ్రకే పెద్దపీట

- వైవీ సుబ్బారెడ్డి, గొల్ల బాబూరావుకు అవకాశం



వైవీ సుబ్బారెడ్డి



గొల్ల బాబూరావు

సాక్షి విశాఖపట్నం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరోసారి ఉత్తరాంధ్ర పక్షపాతి అని నిరూపించారు. రాష్ట్రంలో మూడు రాజ్యసభ స్థానాలకు నోటిఫికేషన్ విడుదలైతే అందులో రెండు ఉత్తరాంధ్రకే అవకాశం కల్పించారు. వైఎస్సార్‌సీపీ ఉత్తరాంధ్ర ప్రాంతీయ సమన్వయకర్త వైవీ సుబ్బారెడ్డి, పాయకరావుపేట ఎమ్మెల్యే గొల్ల బాబూరావును రాజ్యసభ అభ్యర్థులుగా ప్రకటించారు. దీనిపై ఉత్తరాంధ్ర ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

వైవీ సుబ్బారెడ్డి..

వైవీ సుబ్బారెడ్డిది ప్రకాశం జిల్లా మేదరమెట్ల. తల్లిదండ్రులు ఎర్రం చిన్నపోలిరెడ్డి, పిచ్చమ్మ. షోలాపూర్‌లో భారతీ విద్యాపీఠ్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ ఎంబీఎ(మార్కెటింగ్ అండ్ ఫైనాన్స్) పూర్తి చేశారు. 2014 సాధారణ ఎన్నికల్లో ఒంగోలు లోక్‌సభ నియోజకవర్గం నుంచి వైఎస్సార్ కాంగ్రెస్ అభ్యర్థిగా విజయం సాధించి 16వ లోక్‌సభలో అడుగుపెట్టారు. పరిశ్రమల స్టాండింగ్ కమిటీలో సభ్యుడిగా, ప్రైవేట్ బిల్లుల, తీర్మానాల కమిటీలో సభ్యుడిగా, పార్లమెంట్ సభ్యుల స్థానిక ప్రాంత అభివృద్ధి పథకాల(ఎంపీ ల్యాడ్స్) కమిటీ, ఆర్థిక కార్పొరేట్ వ్యవహారాల మంత్రిత్వ శాఖలో కాన్సులేటివ్ కమిటీలో సభ్యుడిగా పనిచేశారు. ప్రత్యేక హోదా కోసం 2018లో లోక్‌సభ సభ్యత్వానికి రాజీనామా చేశారు. 2019 నుంచి 2023 వరకు రెండు పర్యాయాలు టీటీడీ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించారు. వైఎస్సార్ సీపీలోనూ పలు పదవులు నిర్వర్తించారు. గతంలో ఉమ్మడి తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల రీజనల్ కోఆర్డినేటర్‌గా పని చేశారు. ప్రస్తుతం ఉత్తరాంధ్ర రీజనల్ కోఆర్డినేటర్‌గా పనిచేస్తున్నారు.

విశ్వసనీయతకు గుర్తింపు

విధేయత, విశ్వసనీయతకు గుర్తింపుగా పాయకరావుపేట ఎమ్మెల్యే గొల్ల బాబూరావుకు రాజ్యసభ సభ్యుడిగా అవకాశం కల్పించారు. గ్రూప్–1 అధికారిగా ఉద్యోగ బాధ్యతలు నిర్వహించిన బాబూరావు మూడుసార్లు ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. 2009లో జరిగిన సాధారణ ఎన్నికల్లో కాంగ్రెస్ తరఫున పాయకరావుపేట అసెంబ్లీ స్థానానికి పోటీ చేశారు. అక్కడ ముప్పై ఏళ్ల టీడీపీ కంచుకోటను బద్దలు కొట్టి తొలిసారిగా కాంగ్రెస్ పార్టీ జెండా ఎగురు వేశారు. కొద్ది నెలలకే వైఎస్సార్ దుర్మరణం పాలవ్వడంతో తదనంతర పరిణామాల్లో జగన్‌మోహన్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసి వైఎస్సార్‌సీపీని స్థాపించారు. జిల్లాలో బాబూరావు ఒక్కరే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి జగన్ వెంట నడిచారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి ఉమ్మడి విశాఖ జిల్లా అధ్యక్షుడిగా, పార్టీ రాష్ట్ర కార్యదర్శిగా కూడా పనిచేశారు. 2012లో జరిగిన ఉప ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ తరఫున పోటీ చేసి భారీ మెజార్టీతో విజయం సాధించారు. 2014 ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ తరఫున అమలాపురం ఎంపీగా పోటీ చేసి ఓటమి చెందారు. 2019 ఎన్నికల్లో తిరిగి పాయకరావుపేట ఎమ్మెల్యేగా విజయం సాధించారు. ప్రస్తుతం అసెంబ్లీ ఎస్సీ వెల్ఫేర్ కమిటీ చైర్మన్‌గా కూడా వ్యవహరిస్తున్నారు.

అరసవల్లి ఆలయ ఈఓగా రమేష్‌బాబు




రమేష్‌బాబును అభినందిస్తున్న పాలకమండలి సభ్యులు మండవిల్లి రవి, ప్రధానార్చకులు శంకరశర్మ

అరసవల్లి: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం అరసవల్లి శ్రీసూర్యనారాయణ స్వామి ఆలయ కార్యనిర్వహణాధికారిగా డిప్యూటీ కమిషనర్ డీఎల్‌వీ రమేష్‌బాబు గురువారం ఉదయం బాధ్యతలు స్వీకరించారు. అన్నవరం సత్యనారాయణ స్వామి ఆలయంలో అసిస్టెంట్ కమిషనర్‌గా పనిచేస్తున్న రమేష్‌బాబుకు డీసీగా పదోన్నతి కల్పించి తొలి పోస్టింగ్ అరసవల్లిలో ఇచ్చారు. అరసవల్లిలో ఈఓగా పనిచేసిన వి.హరి సూర్యప్రకాష్‌ను నిడదవోలు (తిమ్మరాజుపాలెం) కోట సత్తెమ్మ ఆలయ ఈఓగా బదిలీ చేసినట్లుగా సమాచారం. కొత్త ఈఓ రమేష్‌బాబుకు ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మ, ఆలయ పాలకమండలి సభ్యులు మండవిల్లి రవి, ఎన్.కోటీశ్వర చౌదరి, డాక్టర్ కొంచాడ సోమేశ్వరరావు, జలగడుగుల శ్రీనివాస్‌లు గౌరవంగా స్వాగతం పలికి అంతరాలయ దర్శనం చేయించి, అనంతరం ప్రత్యేకంగా అభినందనలు తెలియజేశారు. వీరితో పాటు విజయనగరం జిల్లా పైడితల్లి అమ్మవారి ఆలయ ఈఓ సుధారాణి, స్థానిక జిల్లా దేవదాయ శాఖ కార్యాలయ సూపరింటెండెంట్ ప్రసాద్‌పట్నాయక్ తదితరులు కూడా కొత్త ఈఓను మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు, శుభాకాంక్షలు తెలియజేశారు.

తొలి డిప్యూటీ కమిషనర్‌గా..

వార్షికాదాయం ప్రామాణికంగా ఇంతవరకు అసిస్టెంట్ కమిషనర్ హోదాతో ఉన్న అరసవల్లి శ్రీసూర్యదేవాలయాన్ని డిప్యూటీ కమిషనర్ హోదా ఆలయంగా ఇటీవలే రాష్ట్ర ప్రభుత్వం గెజిట్ విడుదల చేసింది. ఈ మేరకు అరసవల్లి ఆలయంలో తగిన క్యాడర్ స్ట్రెంత్‌ను కేటాయించడంతో పాటు డిప్యూటీ కమిషనర్ హోదా అధికారిని కూడా నియమించారు. దీంతో విజయనగరం జిల్లా, పార్వతీపురం మన్యం జిల్లా, శ్రీకాకుళం జిల్లాల్లో తొలి డిప్యూటీ కమిషనర్ హోదా ఆలయంగా అరసవల్లికి గుర్తింపు పొందింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇక్కడ పని చేయడం అదృష్టంగా భావిస్తున్నానని, 16న జరగనున్న రథ సప్తమి ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించేలా చర్యలు చేపడతానని తెలిపారు.


ఉత్తరాది రాష్ట్రాలకు ఉద్దానం పనస



పలాసలో ఎగుమతికి సిద్ధం చేస్తున్న వ్యాపారులు


పలాస: ఉద్దానం పనస ఉత్తరాదికి వెళ్లడానికి సిద్ధమవుతోంది. జీడి పిక్కల సీజను ముందు పనస పంట రైతులకు కాస్త ఆర్థిక ఊరటనిస్తుంది. జీడి, కొబ్బరిలో అంతరతోటగా పనసను సాగు చేస్తారు. ఈ పనస పంటకు ప్రస్తుతం మార్కెట్‌లో బాగా గిరాకీ ఉంది. కిలో పనసను రూ.25ల చొప్పున కొనుగోలు చేస్తున్నారు. రోజుకు రైతుల నుంచి సేకరించిన లేత పనస కాయలను 100 టన్నుల వరకు కొనుగోలు చేసి ఉత్తరాది రాష్ట్రాలకు ఎగుమతులు చేస్తున్నట్టు పలాస వ్యాపారి అచ్యుత పాత్రో చెప్పారు. ప్రస్తుతం ధరలు బాగున్నాయని రైతులు సంతోషం వ్యక్తం చేశారు.

అంబాజీపేట.. సందడి



ప్రేక్షకులకు అభివాదం చేస్తున్న చిత్ర యూనిట్

శ్రీకాకుళం అర్బన్: జిల్లా కేంద్రంలో 'అంబాజీపేట మ్యారేజీ బ్యాండ్' చిత్ర యూనిట్ గురువారం సందడి చేసింది. హీరో సుహాస్, హీరోయిన్ శివాని, దర్శకుడు దుష్యంత్ కాటికనేని తదితరులు ఎస్‌వీసీ థియేటర్‌కు గురువారం సాయంత్రం విచ్చేసి సందడి చేశారు. ఈ చిత్ర యూనిట్‌కు థియేటర్ మేనేజర్ రవి స్వాగతం పలికి పుష్పగుచ్ఛం అందజేశారు. చిత్ర హీరో సుహాస్, హీరోయిన్ శివానిలు ప్రేక్షకులతో సెల్ఫీలు దిగి సందడి చేశారు. అనంతరం నిర్వహించిన విలేకరుల సమావేశంలో చిత్ర హీరో సుహాస్ మాట్లాడుతూ మంచి కథ ఉన్న సినిమాలను ప్రేక్షకులు ఆదరిస్తారని మరోసారి రుజువు చేశారన్నారు. ఏజెంట్ సాయి చిత్రం నుంచి అంబాజీపేట మ్యారేజీ బ్యాండ్ చిత్రం వరకూ తన చిత్రాలను ప్రేక్షకులు ఎంతగానో ఆదరించారన్నారు. దర్శకుడు దుష్యంత్ కాటికనేని మాట్లాడుతూ సినిమాను ఆదరించి విజయవంతం చేసినందుకు ప్రేక్షకులకు రుణపడి ఉంటానని తెలిపారు. కార్యక్రమంలో చిత్ర విలన్ నితిన్, చిత్ర యూనిట్ సభ్యులు శరణ్య తదితరులు ఉన్నారు.



ప్రేక్షకులతో సెల్ఫీ దిగుతున్న హీరో సుహాస్

ఎన్నికల నియమావళిపై శిక్షణ

శ్రీకాకుళం పాతబస్టాండ్: ఎన్నికల నియమావళి, సమాచార సాంకేతికతపై పూర్తి స్థాయిలో అవగాహన కలిగి ఉండాలని సీపీఓ, మాస్టర్ ట్రైనర్ లక్ష్మీ ప్రసన్న చెప్పారు. జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో సార్వత్రిక ఎన్నికలు–2024లకు సంబంధించి (ఏఎల్ఎంటీ) మాస్టర్ ట్రైనర్స్ శిక్షణ తరగతులలో ఆమెతో పాటు మాస్టర్ ట్రైనర్స్ డిప్యూటీ సీఈఓ వెంకటరామన్, మెప్మా పీడీ కిరణ్ కుమార్ పాల్గొని ఎంసీసీ, ఐటీలపై అవగాహన కల్పించారు. సీపీఓ లక్ష్మీ ప్రసన్న మాట్లాడుతూ ఎన్నికల ఖర్చులు, ఎన్నికల నియమావళిలపై ఏఎల్ఎంటీలకు అవగాహన కల్పించారు. ఎన్నికల్లో ప్రజా ప్రతినిధులు వచ్చే సమయంలో ప్రొటోకాల్ ఉండదని జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈఓ ఆర్.వెంకటరామన్ వివరించారు.

క్లుప్తంగా

నేడు రథసప్తమి సమన్వయ సమావేశం

అరసవల్లి: రథసప్తమి మహోత్సవానికి సంబంధించి అరసవల్లిలో చేపడుతున్న దర్శన ఏర్పాట్లు తదితర సౌకర్యాల కల్పనపై శుక్రవారం ఉదయం 10 గంటలకు అనివెట్టి మండపంలో ప్రత్యేక సమన్వయ సమావేశం జరుగుతుందని ఆలయ ఈఓ డీఎల్‌వీ రమేష్ బాబు తెలియజేసారు. శ్రీకాకుళం ఆర్డీఓ సీహెచ్ రంగయ్య ఆధ్వర్యంలో మున్సిపల్, పోలీస్, వైద్యం, రెవెన్యూ, విద్యుత్, ఫైర్, మత్స్యశాఖ, దేవదాయ శాఖలతో పాటు పలు ముఖ్య ప్రభుత్వ శాఖాధికారులతో కలిసి పలు అంశాలు, ఏర్పాట్లపై సూచనలు, సలహాలతో సమన్వయపర్చుకునేలా సమావేశం ఉంటుందని ఆయన తెలియజేశారు. తప్పనిసరిగా అనుబంధ ప్రభుత్వ శాఖాధికారులు ఈ సమావేశానికి హాజరుకావాలని ఆయన కోరారు.

'ఉత్తమ ఫలితాలు సాధించాలి'



కొత్తూరులోని ఏకలవ్య పాఠశాలలో పదో తరగతి విద్యార్థులతో మాట్లాడుతున్న పీఓ కల్పన కుమారి

కొత్తూరు: పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించేలా విద్యార్థులను సమాయత్తం చేయాలని ఉపాధ్యాయులకు ఐటీడీఏ పీఓ కల్పనకుమారి తెలిపారు. కొత్తూరులో నిర్వహిస్తున్న ఏకలవ్య పాఠశాలను గురువారం పీఓ సందర్శించారు. విద్యార్థులను పలు ప్రశ్నలు అడిగి సమాధానాలు రాబట్టారు. గణితం, సైన్స్ సబ్జెక్టుల్లో ప్రత్యేక దృష్టి సారించాలని ఉపాధ్యాయులు, విద్యార్థులకు తెలిపారు. రివిజన్ చేయించాలని సూచించారు. విద్యార్థులు ప్రణాళికాబద్ధంగా చదువుకోవాలన్నారు. ఉత్తమ ఫలితాల సాధన కోసం మరింతగా కృషి చేయాలని ప్రిన్సిపాల్ సురేష్‌కుమార్‌కు పీఓ సూచించారు.

బీఎస్ఎఫ్ జవాన్‌కు అశ్రు నివాళి



అధికార లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహిస్తున్న బీఎస్ఎఫ్ జవాన్లు

టెక్కలి రూరల్: టెక్కలి మండలం గూడేం గ్రామానికి చెందిన పిట్ట రాము అనే బీఎస్ఎఫ్ జవాను రైలు కింద పడి మృతి చెందిన విషయం తెలిసిందే. ఆయన పార్థివ దేహాన్ని గురువారం సాయంత్రం ప్రత్యేక వాహనంలో బీఎస్ఎఫ్ జవాన్లు టెక్కలి సమీపంలోకి తీసుకురాగా.. అప్పటికే అక్కడకు చేరుకున్న జనాలను మృతదేహాన్ని ఊరేగింపుగా గ్రామం వరకు తరలించారు. అనంతరం బీఎస్ఎఫ్ జవాన్లు మృతదేహంపై జాతీయ జెండాను కప్పి నివాళులర్పించారు. తర్వాత అధికార లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించారు.

ప్రముఖ రచయిత 'శ్రీపతి' మరణం తీరని లోటు



రచయిత శ్రీపతి

శ్రీకాకుళం కల్చరల్, కవిటి: విరసం తొలితరం నాయకుడు ప్రముఖ రచయిత శ్రీపతి (పుల్లట చలపతి) వయోభారంతో పరమపదించడం సాహిత్య లోకానికి తీరని లోటని ప్రముఖ రచయిత అట్టాడ అప్పలనాయుడు ఓ ప్రకటనలో తెలిపారు. ఈయన సొంత ఊరు శ్రీకాకుళం జిల్లా కవిటి మండలం బైరిపురం కాగా హైదరాబాద్‌లో స్థిరపడ్డారు. హైదరాబాద్‌లోని ఒక ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందారని అప్పలనాయుడు తెలిపారు. శ్రీపతి రచించిన మంచుపల్లకి-మరి తొమ్మిది, సత్యజిత్ రాయ్ ఎవరు, బెనారస్ చిత్రాలు వంటి కథా సంపుటాలు ఎందరినో ఆకట్టుకున్నాయని తెలిపారు. ఆయన కథాశైలి విశేషమైనదని అప్పలనాయుడు పేర్కొన్నారు.


టీచర్ కుమారస్వామికి పీఆర్‌టీయూ సత్కారం



కుమారస్వామిని సత్కరిస్తున్న పీఆర్‌టీయూ జిల్లాశాఖ నాయకులు

శ్రీకాకుళం న్యూకాలనీ: జాతీయ స్థాయి సైన్స్ ప్రాజెక్టుల ప్రదర్శనకు జిల్లా నుంచి ఎంపిక కావడంతోపాటు ప్రత్యేక బహుమతిని అందుకున్న ఉపాధ్యాయుడు బోర కుమారస్వామిని పీఆర్‌టీయూ జిల్లాశాఖ ఘనంగా సత్కరించింది. చింతాడ మున్సిపల్ ఉన్నత పాఠశాలలో ఫిజికల్ సైన్స్ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న కుమారస్వామిని గురువారం ఆ పాఠశాల ప్రాంగణంలో జరిగిన అభినందన కార్యక్రమంలో పీఆర్‌టీయూ సంఘ జిల్లా శాఖ అధ్యక్షుడు తంగి మురళీమోహన్, కార్యదర్శి దానేటి కేశవరావు, రాష్ట్ర గౌరవాధ్యక్షులు బైరి అప్పారావు, రాష్ట్ర సహఅధ్యక్షులు పప్పల రాజశేఖరరావు, వడ్డాది గోపీకృష్ణ తదితరులు పాల్గొని ఆయనను సత్కరించారు.

గురుకులానికి ఆహ్వానం



- ఐదో తరగతి, ఇంటర్‌లో ప్రవేశాలు
- దరఖాస్తుల స్వీకరణ ప్రారంభం
- 23 వరకు గడువు

శ్రీకాకుళం పాతబస్టాండ్: పేద, మధ్య తరగతి, ఆర్థికంగా వెనుకబడిన సామాజిక వర్గాల్లోని పిల్లలను అంబేడ్కర్ గురుకులం ఆహ్వానిస్తోంది. ఐదోతరగతి, ఇంటర్‌లో చేరేందుకు దరఖాస్తులను కోరుతోంది. 2024–25 విద్యా సంవత్సరంలో ప్రవేశాలకు ఫిబ్రవరి 23వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. ఒకసారి సీటు పొందితే ఆ విద్యార్థికి వసతితో పాటు ఇంటర్మీడియెట్ వరకూ ఉచితంగా చదువుకునే అవకాశం కలుగుతుంది. ఆంగ్ల మాధ్యమంలో బోధనతో పాటు నీట్/ఐఐటీల్లో ఉచితంగా శిక్షణ ఇస్తారు. విద్యార్థులు మార్చి 10న జరిగే కామన్ టాలెంట్ ఎంట్రన్స్ టెస్టులో ప్రతిభ చూపి ప్రవేశాలు పొందవచ్చు.

ఇవీ అర్హతలు..

- ఐదో తరగతిలో ప్రవేశానికి ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు 2011 సెప్టెంబరు 1 నుంచి 2015 ఆగస్టు 31 మధ్య జన్మించి ఉండాలి. ఓసీ, బీసీ, ఎస్సీ కన్వర్టెడ్ క్రిస్టియన్(బీసీ–సీ) విద్యార్థులు 2013 సెప్టెంబరు1 నుంచి 2015 ఆగస్టు 31 మధ్య జన్మించి ఉండాలి.
- జూనియర్ ఇంటర్మీడియెట్ ప్రవేశాలకు 2023–24 ఏడాదిలో పదో తరగతి పరీక్షకు హాజరవుతున్న వారు అర్హులు. వయసు 2024 ఆగస్టు 31 నాటికి 17 ఏళ్లు దాటకూడదు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకులం, సాంఘిక సంక్షేమ వసతి గృహాల్లో చదువుతున్న విద్యార్థులకు సడలింపు ఉంటుంది.
- ఐదో తరగతికి దరఖాస్తు చేసే వారు 3, 4వ తరగతులు ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలల్లో చదవాలి. దరఖాస్తు చేసుకోనున్న విద్యార్థి తల్లిదండ్రుల వార్షిక ఆదాయం రూ. ఒక లక్ష దాటకూడదు.


దరఖాస్తు చేసుకునే విధానం

విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. ఐదో తరగతి, ఇంటర్‌కు హెచ్‌టీటీపీఎస్:ఏపీబీఆర్ఏజీసీఈటీ, ఏపీసీఎఫ్ఎస్ఎస్.ఇన్. ద్వారా ఫిబ్రవరి 23లోగా దరఖాస్తు చేసుకోవాలి. విద్యార్థి ఎంపిక చేసుకున్న పాఠశాల/కళాశాల వివరాలను తప్పనిసరిగా రాయాలి. వివరాలు సబ్మిట్ చేసిన తర్వాత మార్చుకోవడానికి అవకాశం ఉండదు.

ప్రవేశ పరీక్ష షెడ్యూల్

ఐదో తరగతి ప్రవేశ పరీక్ష మార్చి 10 ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకు, ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం ప్రవేశ పరీక్ష మార్చి 10 మధ్యాహ్నం 2 గంటల నుంచి 4.30 వరకు నిర్వహిస్తారు.

మార్కుల ఆధారంగా సీట్ల కేటాయింపు



జిల్లాలో ఉన్న 13 డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల విద్యాలయాల్లో ఐదు, ఇంటర్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదలైంది. ప్రవేశం కోసం దరఖాస్తు చేసుకున్న బాలురు, బాలికలకు మార్చి 10న నిర్వహించే ప్రవేశ పరీక్షలో సాధించే మార్కుల ఆధారంగా సీట్లు కేటాయిస్తాం. పేద, మధ్య తరగతి విద్యార్థులకు ఇది చక్కని అవకాశం.

– ఎస్.బాలాజీ, కోఆర్డినేటర్, బీఆర్ అంబేడ్కర్ గురుకులం, శ్రీకాకుళం

అదుపు తప్పిన ఆటో



ప్రమాదానికి కారణమైన ఆటో

టెక్కలి రూరల్: మండలంలోని శ్యామసుందరాపురం గ్రామ సమీపంలో గురువారం ఉదయం ఒక ఆటో అదుపు తప్పి చెట్టును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో డ్రైవర్‌తో పాటు మరో వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. కోటబొమ్మాళి మండలం బలరాంపురం గ్రామానికి చెందిన కమెల్లి ప్రసాద్ అనే వ్యక్తి ఇటీవల కాలంలో పాత ఆటోను కొనుగోలు చేశాడు. అయితే దాన్ని రిజిస్ట్రేషన్ చేసుకునేందుకు గురువారం తన అన్న కొడుకు కామెల్లి సోమేష్‌తో కలసి ఆటోలో టెక్కలి వైపు వస్తుండగా టెక్కలి సమీప శ్యామసుందరాపురం గ్రామ సమీపంలో జాతీయ రహదారి నుంచి అప్రోచ్ రోడ్డుకు ప్రసాద్ ఆటోను తిప్పుతుండగా ఒక్కసారిగా బండి అదుపుతప్పి సమీప కాలువలోకి వెళ్లి అక్కడ ఉన్న చెట్టును ఢీకొంది. ప్రమాదంలో ఆటో నడుపుతున్న ప్రసాద్‌కు స్వల్ప గాయాలు కాగా వెనుక కూర్చుని ఉన్న సోమేష్ కాలికి దెబ్బ తగిలింది. ఇద్దరినీ హైవే అంబులెన్స్‌లో టెక్కలి జిల్లా ఆస్పత్రికి తరలించారు. అక్కడ వైద్యులు వైద్య పరీక్షలు నిర్వహించి సోమేష్‌ను శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. ఘటనపై టెక్కలి పోలీసులు వివరాలు సేకరించి కేసు నమోదు చేయనున్నట్లు తెలిపారు.

'ప్రాణం విలువ గుర్తించాలి'



చంద్రశేఖర్‌రెడ్డి

ఎచ్చెర్ల క్యాంపస్: వాహన చోదకులు ప్రాణం విలువ గుర్తించాలని శ్రీకాకుళం డిప్యూటీ ట్రాన్స్‌పోర్టు కమిషనర్ ఎ.చంద్రశేఖర్ రెడ్డి అన్నారు. ఎచ్చెర్లలోని శ్రీ వెంకటేశ్వర ఇంజినీరింగ్ కాలేజీలో రోడ్డు భద్రతపై గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలకు ప్రధాన కారణం అతివేగం, రాంగ్ రూట్ డ్రైవింగ్, డ్రంక్ అండ్ డ్రైవింగ్, నిర్లక్ష్యపు డ్రైవింగ్ అని వివరించారు. యువత ద్విచక్ర వాహనాలు నడిపేటప్పుడు తప్పనిసరిగా హెల్మెట్ పెట్టుకోవాలని సూచించారు. తల్లిదండ్రులు సైతం పిల్లలకు అడిగిన వెంటనే అధునాతన బైక్‌లు కొనివ్వటం కంటే డ్రైవింగ్‌పై అవగాహన, లైసెన్స్ తీసుకోవటం వంటి వాటికి ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్లు అర్.అనిల్, పి.వి.గంగాధర్, ప్రిన్సిపాల్ వీకే చక్రవర్తి పాల్గొన్నారు.

108 వాహనం తనిఖీ

వజ్రపుకొత్తూరు రూరల్: వజ్రపుకొత్తూరు మండలానికి కేటాయించిన 108 వాహనాన్ని గురువారం డివిజనల్ అధికారి జి.జగన్నాథరావు ఆకస్మికంగా తనిఖీ చేశారు. వాహనంలో అత్యవసర వైద్యానికి అవసరమైన మందులు, పరికరాలు ఉన్నాయో లేవో అని సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు అందుతున్న అత్యవసర సేవలపై ఆరా తీశారు. 108 సేవలు, సిబ్బంది పనితీరుపై ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. ఆయనతో పాటు ఈఎంటీ పి.గోపి,పైలట్ డి.రాజేష్ తదితరులు ఉన్నారు.

వంద శాతానికి చేరువలో..

- జిల్లాలో విజయవంతంగా కులగణన
- 92.27 శాతానికి చేరుకున్న గణన



నరసన్నపేట మండలం ఉర్లాంలో కులగణన చేస్తున్న సర్వే సిబ్బంది

నరసన్నపేట: జిల్లాలో కులగణన వందశాతానికి చేరువవుతోంది. తాజా లెక్కల ప్రకారం 92.27 శాతం కులగణన సర్వే జిల్లా వ్యాప్తంగా పూర్తికాగా రాష్ట్రంలో శ్రీకాకుళం 8వ స్థానంలో నిలిచింది. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు, సంక్షేమాన్ని అందించడమే ధ్యేయంగా ఈ గణనను ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన విషయం విదితమే. కులగణనలో ప్రతి ఇంటి నుంచి సేకరించిన వివరాలను ప్రత్యేక యాప్‌లో పొందు పరిచారు. మిగిలిన వారి వివరాలను కూడా సేకరించి శత శాతం పూర్తి చేయాలనే ఉద్దేశంతో అటు వలంటీర్లు, ఇటు క్లస్టర్ ఇన్‌చార్జిలు ప్రయత్నాలు చేస్తున్నారు. కులాల వారీగా జనాభా, వారి ప్రస్తుత సామాజిక, విద్య, ఆర్థిక పురోభివృద్ధి వంటివి ఈ గణనలో తెలుసుకున్నారు. గత నెల 19 నుంచి ప్రభుత్వం దీన్ని చేపట్టింది. పారదర్శకంగా నిర్వహించేలా ప్రభుత్వం అన్ని జాగ్రత్తలు తీసుకుంది. సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు వారి పరిధిలోని ఇళ్లకు వెళ్లి ప్రతి ఒక్కరికీ సంబంధించిన వివరాలను కులాల వారీగా సేకరించారు. దాదాపు 723 కులాలు ఉన్నట్లు ప్రభుత్వం గుర్తించి వాటిని యాప్‌లో పొందు పరిచారు. ఈ నెల 4 వ తేదీతో కులగణన పూర్తి కావాల్సి ఉండగా 12వ తేదీ వరకూ ప్రభుత్వం గడువు పెంచింది.

జిల్లాలో 6,81,824 ఇళ్లలో సర్వే పూర్తి..

జిల్లా అధికారుల ఆదేశాలు, పర్యవేక్షణలో మొత్తం 732 సచివాలయాలను 12477 క్లస్టర్లుగా విభజించారు. మొత్తం 7,40,562 గృహాలు ఉండగా 6,81,824 ఇళ్లల్లో సర్వే పూర్తి చేశారు. క్షేత్ర స్థాయిలో కుటుంబ సభ్యులు అందుబాటులో లేక పోవడం, ఇళ్లకు తాళాలు వేసి ఉండటం వల్ల 58,738 ఇళ్లకు సంబంధించి 2,65,331 మందికి చెందిన వివరాలు సేకరించాల్సి ఉంది. వీరి వివరాల కోసం ఇప్పటికీ వలంటీర్లు, సచివాలయ సిబ్బంది ఆరా తీస్తున్నారు. నూరు శాతం గణన పూర్తి చేయాలనే లక్ష్యంతో మళ్లీగడువు పెంచారు.

మండలం	మొత్తం గృహాలు	సర్వే చేసిన గృహాలు
వజ్రపుకొత్తూరు	26,865	23,879
శ్రీకాకుళం మున్సిపాలిటీ	42,137	37625
పాతపట్నం	23,366	20934
సోంపేట	24,953	22389
శ్రీకాకుళం రూరల్	33,724	30,321
ఇచ్ఛాపురం	11,032	10,022
పలాస	14,156	12,888
కాశీబుగ్గ మున్సిపాలిటీ	18,228	16,614
నందిగాం	20,173	18,402
మెళియాపుట్టి	18,139	16,552
టెక్కలి	25,591	23,359
సరుబుజ్జిలి	10,821	9,927
పొందూరు	24,607	22,612
ఎల్ఎన్‌పేట	11,870	10908
కంచిలి	21,287	19,584
కోటబొమ్మాళి	25,269	23248
హిరమండలం	13,160	12,111
ఇచ్ఛాపురం	17,408	16,059
రణస్థలం	28,583	26,465
జలుమూరు	20,788	19,252
సంతబొమ్మాళి	24,857	23,022
ఆమదాలవలస	15,920	14,748
నరసన్నపేట	25,998	24,105
లావేరు	22,434	20,819
మందస	26,342	24,483
కొత్తూరు	24,134	22,449
పోలాకి	22,815	21,361
ఎచ్చెర్ల	29,547	27,742
ఆమదాలవలస మున్సిపాల్టీ	13,870	13,027
గార	26,850	25,252
కవిటి	24,495	23,053
బూర్జ	14,543	13,742
సారవకోట	17,736	16,832
జి.జిగడాం	18,864	18,038

సాధారణ ఎన్నికలకు సమాయత్తం

- కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్

శ్రీకాకుళం పాతబస్టాండ్: సాధారణ ఎన్నికలను ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు అంతా సమాయత్తం కావాలని కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్ పిలుపునిచ్చారు. దీనికి రాజకీయ పార్టీల సహకారం ఎంతో అవసరమని అన్నారు. కలెక్టర్ కార్యాలయంలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో 32వ వారపు సమావేశంలో ఆయన మాట్లాడారు. రానున్న ఎన్నికల కోసం జిల్లా యంత్రాంగ సన్నద్ధతను తెలిపేందుకే ప్రతివారం ఈ సమావేశాలు నిర్వహిస్తున్నామని, జిల్లాలో ఎక్కడా రీ పోలింగ్ జరపకుండా ఉండటం, ఓటింగ్ శాతాన్ని పెంచడమే తమ ప్రధాన లక్ష్యమని అన్నారు. సమస్యాత్మక, సున్నితమైన పోలింగ్ కేంద్రాలను గుర్తించామని, వెబ్ కాస్టింగ్, పటిష్టమైన బందోబస్తును ఏర్పాటు చేయడం కోసం ప్రణాళికలు పూర్తిచేశామని వివరించారు. స్ట్రాంగ్ రూములు, కౌంటింగ్ కోసం కేటాయించిన కేంద్రాన్ని తనిఖీ చేశామన్నారు. పోలింగ్ కేంద్రాల్లో కనీస మౌలిక సదుపాయాల కల్పన పనులను దాదాపు పూర్తి చేశామని చెప్పారు. తొలుత ఆయన ఆయా రాజకీయ పార్టీల ప్రతినిధులను పరిచయం చేసుకున్నారు. అనంతరం వారు అడిగిన పలు ప్రశ్నలకు సమాధానం చెబుతూ నామినేషన్లకు చివరి రోజు వరకు ఓటరు జాబితాలో చేర్పులు, మార్పుల కోసం అవకాశం ఉందని, ఎన్నికల తేదీని ప్రకటించిన తర్వాత మాత్రం తొలగింపు ప్రక్రియ నిలిచిపోతుందని స్పష్టం చేశారు. ఓటరు సహాయం కోసం 1950 టోల్ ఫ్రీ నంబర్ పనిచేస్తుందని, రాజకీయ పార్టీలు లిఖిత పూర్వకంగా లేదా ఫోన్ ద్వారా ఏమైనా సలహాలు, ఫిర్యాదులు ఇవ్వదలుచుకుంటే వారి కోసం ప్రత్యేకంగా ఈమెయిల్ ఐడీని, ప్రత్యేక ఫోన్ నంబర్‌ను కేటాయిస్తామని వాటి వివరాలు త్వరలో వెల్లడిస్తామని చెప్పారు. ఫారం–7 దాఖలు విషయంలో నిబంధనలు ఉల్లంఘించిన ఇద్దరిపై జిల్లాలో క్రిమినల్ కేసులు నమోదు చేశామని, ముందు ముందు ఎన్నికల ప్రక్రియకు విఘాతం కలిగించే వ్యక్తులపై కూడా క్రిమినల్ కేసులు నమోదు చేసి చట్టపరంగా చర్యలు తీసుకుంటామన్నారు. తుది ఓటరు జాబితా ప్రకటన తర్వాత 0.1 శాతానికి మించి ఓటర్లను తొలగించడం సాధ్యం కాదని, ఈ విషయంలో ఎవరూ అపోహలు పడాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. గడిచిన వారం రోజుల్లో మార్పులు, చేర్పులు, ఇతర సవరణల కోసం 11536 మంది దరఖాస్తులు చేసుకున్నారని వాటిని క్షుణ్ణంగా పరిశీలించి తదుపరి చర్య తీసుకుంటామన్నారు.

జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్ మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఒక నోడల్ ఆఫీసర్ ఆధ్వర్యంలో నలుగురు ప్రత్యేక అధికారులతో మొత్తం 13 మంది సప్లిమెంటరీ జాబితా కోసం పనిచేస్తున్నారని వివరించారు. వీటిని గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలకు ఎన్నికల కమిషన్ నిబంధనల ప్రకారం అందజేస్తామన్నారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి జేవీఎస్ రామ్మోహనరావు, రొంగు శంకరరావు (వైఎస్సార్ సీపీ), పి.ఎం.జే.బాబు (టీడీపీ), దేసెళ్ల మల్లిబాబు (కాంగ్రెస్), అర్.సోమేశ్వరరావు (బీఎస్పీ), సురేష్ బాబు సింగ్ (బీజేపీ) తదితరులు పాల్గొన్నారు.

కన్నతండ్రి అకృత్యం

శ్రీకాకుళం రూరల్: కూతురుని కంటికి రెప్పలా కాపాడుకోవాల్సిన తండ్రి ఆ బిడ్డ పాలిట మృగాడిగా మారాడు. కన్న కూతురితోనే అసభ్యంగా ప్రవర్తించాడు. ఎలా చెప్పుకోవాలో, ఎవరికి చెప్పుకోవాలో తెలీక నరకం చూసిన ఆ అమ్మాయి తల్లి సాయంతో పోలీసులను ఆశ్రయించింది. శ్రీకాకుళంలో జరిగిన ఈ ఘటన స్థానికంగా కలకలం రేపింది. నగరంలోని ఓ కాలనీలో నివాసం ఉంటూ ట్రావెల్ ఏజెన్సీ నడుపుతున్న దంపతులకు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. పెద్ద కుమార్తె చిన్నప్పుడే చనిపోగా చిన్నమ్మాయి 8వ తరగతి చదువుతోంది. గత నెలలో భార్యాభర్తల మధ్య గొడవ జరిగింది. ఆ గొడవ జరిగిన రోజు తండ్రి కూతురిపై అసభ్యంగా ప్రవర్తించాడు. దీంతో అదేరోజు రాత్రి తల్లీకూతుళ్లు తమ బంధువుల ఇంటికి వెళ్లిపోయారు. మూడు రోజుల కిందట తల్లీకూతుళ్లు స్థానిక దిశ పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి అతనిపై ఫిర్యాదు చేశారు. బాలిక జనవరిలో రజస్వల అయిన నాటి నుంచి ఈ అకృత్యాలు జరుగుతున్నట్లు వారు ఫిర్యాదులో పేర్కొన్నారు. భయంతో తాను ఎవరికీ ఏమీ చెప్పలేక పోయానని బాలిక పోలీసులకు చెప్పింది. ప్రైవేటు భాగాలను పట్టుకోవడం, రాత్రిళ్లు వికృతంగా ప్రవర్తించడం చేసేవాడని తెలిపారు. ఈ ఫిర్యాదు మేరకు రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. నిందుతుడిపై పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేసి బుధవారం రిమాండ్‌కు తరలించారు.

ఉత్తమ ఉద్యోగులకు ప్రశంసా పత్రాలు



ఉత్తమ సేవలు అందజేసిన వీఏఏలకు ప్రశంసాపత్రాలు, మెమొంటోలు అందజేస్తున్న దృశ్యం

టెక్కలి: ప్రభుత్వం ఎంతో మంచి ఉద్దేశంతో రూపకల్పన చేసిన రైతు భరోసా కేంద్రాల ద్వారా ఆయా పరిధిలో గల రైతులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు చేరువ చేసే విధంగా వ్యవసాయ సహాయకులు మరిన్ని సేవలు అందజేయాలని జిల్లా వ్యవసాయాధికారి కె.శ్రీధర్ వెల్లడించారు. వ్యవసాయ శాఖ టెక్కలి డివిజన్ పరిధిలో టెక్కలి, కోటబొమ్మాళి, నందిగాం, సంతబొమ్మాళి, పాతపట్నం మండలాల్లో ఆర్‌బీకేల్లో ఉత్తమ సేవలు అందజేసిన గ్రామ వ్యవసాయ సహాయకులకు గురువారం టెక్కలిలో ప్రశంసా పత్రాలు, మెమొంటోలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల కోసం ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలను వారి చెంతకు చేర్చే విషయంలో మరింత నిబద్ధతగా పని చేయాలన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ప్రభుత్వం రైతు భరోసా వ్యవస్థకు రూపకల్పన చేసిందని, దీని ముఖ్య ఉద్దేశాన్ని రైతులకు పూర్తి స్థాయిలో వివరించి వారికి అందుబాటులో ఉండాల్సిన బాధ్యత వీఏఏలపై ఉందని జేడీ శ్రీధర్ పేర్కొన్నారు.

టెన్త్‌లో ఉత్తమ ఫలితాల సాధనకు కృషి




సర్వేపల్లి రాధాకృష్ణన్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఆర్‌జేడీ జ్యోతి కుమారి, డీఈఓ వెంకటేశ్వరరావు

సారవకోట: టెన్త్‌లో ఉత్తమ ఫలితాలు సాధించేందుకు కృషి చేస్తున్నట్లు విద్యా శాఖ రీజనల్ జాయింట్ డైరెక్టర్ ఎం.జ్యోతికుమారి తెలిపారు. మండలంలోని బుడితి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన సర్వేపల్లి రాధాకృష్ణన్ విగ్రహాన్ని, ఫొటో గ్యాలరీని ఆమె గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గత ఏడాది రాష్ట్రంలో 10వ తరగతి ఫలితాల్లో మొదటి 7 స్థానాలకు గాను 6 స్థానాల్లో విశాఖపట్నం జోన్ విద్యార్థులే ఉన్నారని, ఈ ఏడాది అంతకు మించి ఉత్తమ ఫలితాలు సాధించేందుకు కృషి చేస్తున్నామన్నారు. దీని కోసం వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించి వారు పరీక్షల్లో పాసయ్యేందుకు వీలుగా తర్ఫీదు ఇస్తున్నట్లు తెలిపారు. అలాగే 44 వేల మంది 8వ తరగతి విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ చేశామన్నారు. శ్రీకాకుళం జిల్లాలో ఈ ఏడాది 28,982 మంది విద్యార్థులు 10వ తరగతి పరీక్షలకు హాజరు కానున్నారని, వీరి కోసం 145 పరీక్ష కేంద్రాలను కేటాయించినట్లు ఆమె తెలిపారు. బుడితి ఉన్నత పాఠశాలలో జిల్లాలో ఎక్కడా లేని విధంగా 2014 నుంచి ఈ పాఠశాలలో చిత్రలేఖన ఉపాధ్యాయునిగా పని చేస్తున్న జి.రవికుమార్ విద్యార్థులు వేసిన పలు రకాల పెయింటింగ్‌లను గ్యాలరీలా ఏర్పాటు చేసి దానికి ఓ గదిని కేటాయించడం గొప్ప విషయమన్నారు. ఆమెతో పాటు డీఈఓ వెంకటేశ్వర్లు, డిప్యూటీ ఈఓ విజయకుమారి, డైట్ లెక్చరర్ జి.రవికుమార్, ఎంఈఓ భూలక్ష్మి, ప్రధానోపాధ్యాయులు బి.మాధవరావు, ఉపాధ్యాయులు యోగేశ్వరరావు, చిత్రలేఖన ఉపాధ్యాయులు రవి కుమార్ తదితరులున్నారు.

జోరుగా వరినాట్లు

ఇచ్ఛాపురం రూరల్: ఇచ్ఛాపురం పరిసర ప్రాంతాల్లో వరి నాట్లు జోరందుకున్నాయి. రబీ సీజన్ కావడంతో రైతులు విద్యుత్ మోటార్ల సహాయంతో మండలం, మున్సిపాలిటీ పరిధిలో సుమారు 150 ఎకరాల్లో వరినాట్లు వేస్తున్నారని మండల వ్యవసాయాధికారి భార్గవి రెడ్డి తెలిపారు. ఇప్పటికే వరినారుపై రైతులు అప్రమత్తమయ్యారని, వరితో పాటు అపరాలను పండించేందుకు రైతులు ఉత్సాహం చూపిస్తున్నారని అన్నారు.



హరిపురం ప్రాంతంలో వరినాట్లు